జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 30-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 410 పేజీలు: 4 వెల: రూ.7

* అమదాలవలస నియోజకవర్గంలో వనరుల దోపిడీ * సింగూరు - బొడ్డేపల్లి - మొదలవలస వాసులు ప్రాణాపాయ ప్రయాణాలు



# పడగ విప్పిన.. ఇసుక భూతాలు

**శ్రీకాకుళం, జులై 29 (వార్త):** శ్రీకాకుళం జిల్లా అమదాలవలస నియోజకవర్గంలోని సింగూరు, బొడ్డేపల్లి, మొదలవలస, రాజాపురం, ఆల్లాడ తదితర గ్రామాలు.. ఇప్పుడు పచ్చని పొలాలతో కాకుండా ఇసుక గుట్టలతో, భారీ లారీలు దూసుకొచ్చే మార్గాలుగా మారాయి. రోజూ పగలు, రాత్రి అనే తేడా లేకుండా 70 నుంచి 100 వాహనాల వరకు అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోంది. నదిలోని చప్పుళ్లు గలసిన స్వభావాన్ని కోల్పోయి, ఇప్పుడు మిషన్ల గొలుసుల గర్జనలతో బీభత్సంగా మారింది.



## ప్రశ్నిస్తే ప్రతీకారం

గ్రామ యువత ఈ దోపిడీని ప్రశ్నించాలంటే ముందే వెనక్కి అడుగు వేయాల్సిన పరిస్థితి. ఎందుకంటే ఇప్పటివరకు కొన్ని గ్రామాల్లో యువకులపై భయభ్రాంతులకు గురిచేసే విధంగా దాడులు జరిగాయి. గ్రామస్తుల మాటల్లో చెప్పాలంటే ఎవరు చూస్తున్నారు? ఎవరికి చెబితే స్పందిస్తారు?" అన్న ఉక్కిరిబిక్కిరే మిగిలింది.

## జనప్రయాణాలే నరకయాతన

ఈ ప్రాంతం నుంచి శ్రీకాకుళం చేరేందుకు గ్రామస్తులకు ఇదే ప్రధాన మార్గం. కానీ ఈ చిన్న రహదారిపై భారీ వాహనాలు నిత్యం వేగంగా దూసుకెళ్లడం, వెనక నుంచి పడే ఇసుక దుమ్ము%ొ% అన్నీ కలిసి ప్రజల నిత్యప్రయాణాన్ని మృత్యుదారులుగా మార్చేస్తున్నాయి. బడికి వెళ్లే చిన్నారులు, ఆస్పత్రికి వెళ్లే గర్భిణులు, వృద్ధులు అందరూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నా%ొ% చూడగలిగే నాథుడే లేరు.

## ఎక్కడుంది రెవెన్యూ శాఖ?

ప్రతి గ్రామంలో వీఆర్వో, వీఆర్ఏలు ఉన్నా%ొ% అక్రమ రవాణా కనిపించదా? గ్రామస్తులు ఎత్తిపోతలుగా చూస్తున్న ప్రశ్న ఇదే. ముడుపుల వల్లనే అధికారుల మూగబోయేరనేందుకు ప్రధాన కారణమా? అని తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ఇసుక మాఫియా కళ్ళెం వేయడానికి రెవెన్యూ శాఖే ముందు నడవాలి. కానీ అధికార యంత్రాంగం మాత్రం - ఇదంతా మా పరిధిలో లేదు అనే తీరే చూపిస్తోంది.



## గనులు, భూగర్భ శాఖ ఎక్కడ..



అక్రమ ఇసుక తవ్వకాలను నియంత్రించాల్సిన ప్రాథమిక బాధ్యత గనులు, భూగర్భ శాఖదే. కానీ నదిలోకి బొక్కలతో చొచ్చుకెళ్లి మిషన్లతో ఇసుకను తోడుతున్న దృశ్యాలు కనీసం వారి దృష్టిలో పడట్లేదు. జిల్లాకు చెందిన గనులు శాఖ అధికారులు, స్థాయి పర్యవేక్షకులు.. ఎవరికైనా ఇవి పట్టించుకోవాల్సిన విషయాలు కానీ కావు!

## నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పులు ఏమయ్యాయి?

ఇసుక తవ్వకాల్లో ఎన్జీటీ ఇప్పటికే కీలకమైన తీర్పులు వెలువరించింది. నదుల కట్టుదిట్టమైన పరిరక్షణ, మానవ హస్తక్షేపం తగ్గించాలన్న స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, అమలులో నామమాత్రమైన శ్రద్ధ కనిపిస్తోంది. అసలు సమస్య రాజకీయ మద్దతుతో ఇసుక మాఫియా వ్యవస్థకు అడ్డుకట్ట పడకపోవడమే.

## వెల్లివిరిసిన భయం,, వస్తున్న దుర్భల భవిష్యత్తు

ఈ దోపిడీ ఇలా కొనసాగితే మరో రెండు మూడేళ్లలో కనీసం 40 గ్రామాలు నీటి లేక మొండి బీడుగా మారే అవకాశం ఉందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. గంగమ్మ ఒడిలో ఉన్న ఊళ్ళే చెరువుల నీళ్లు మట్టితో నింపుకోవడమంటే భవిష్యత్ తరాల మీద కరుణ లేకపోవడమే.

## రోజుకి లక్షల రూపాయలు ఎవరి జేబుల్లోకి..

ప్రతీ రోజూ అక్రమంగా దోచిపెట్టే ఇసుకపై ఎవ్వరికీ భయం లేకుండా వ్యాపారం సాగుతోందంటే వెనుక అంతమంచి ఆధారం ఉన్నట్టే. హైవే వైపు పోయే వందల వాహనాల్లోని ఇసుక ఏ జేబుల్లోకి, ఎన్ని లక్షలు చేరుతోందో ఎవరికీ లెక్కలు లేవు. ఇది కేవలం ఒక గ్రామ సమస్య కాదు. ఇది పరిసరాల ప్రకృతి, భవిష్యత్తు తరం మీద కత్తి పెట్టే మాఫియా రాజకీయాల రూపం. చివరగా ఈ కథనం ఒక హెచ్చరిక. నేడు ప్రశ్నించకపోతే రేపటికి నీరు కూడా ఉండదు. నియోజకవర్గ ప్రజలు సాహసంగా గళమెత్తితే మాత్రమే ఇసుక మాఫియాకు కళ్లెం పడుతుంది. అప్పటికైనా జిల్లా పరిపాలన యంత్రాంగం, పోలీసు వ్యవస్థ మేలుకుని చట్టబద్ధ చర్యలు తీసుకుంటే - గ్రామాలకి, గంగకి, భవిష్యత్‌కి ఒక అవకాశం దక్కుతుంది.

# బయో గ్యాస్ తయారీ కేంద్రాలకు ప్రభుత్వం ఆమోదం

*** సిగడాం మండలం సంతఉరిటి గ్రామంలో పీవీఎస్ రామ్మోహన్ సంస్థకు అనుమతి * పరిశుభ్రమైన విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం ప్రోత్సాహం**

**శ్రీకాకుళం, జులై 29 (వార్త):** శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలంలోని సంతఉరిటి గ్రామంలో రెండు జీవ వాయు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఒక్కొక్క కేంద్రం నిత్యం 15 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగినవి. ఈ కేంద్రాలను పీవీఎస్ రామ్మోహన్ ప్రైవేట్ సంస్థ ఏర్పాటుచేయనుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జూలై 28, 2025న జీవో నెం.63 విడుదల చేసింది.

**పరిశుభ్రమైన శక్తి లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు:**

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆంధ్రప్రదేశ్ సమగ్ర పరిశుభ్రమైన విద్యుత్ విధానం - 2024 ప్రకారం ఈ ప్రణాళికకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో శుద్ధ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒకటి. ఈ విధానంలో భాగంగా దాదాపు 160 వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన శుద్ధ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని ద్వారా రూ. 10 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు సుమారు 7.5 లక్షల ఉద్యోగాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కలగనున్నాయని ప్రభుత్వం అంచనా వేసింది.

**వ్యవసాయ వ్యర్థాలను శుద్ధ ఇంధనంగా మార్చే ప్రణాళిక:**

రాష్ట్రంలో 62 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడుతోంది. చక్కెర గడలు, మక్కజొన్న, ధాన్యం గింజలు, బియ్యం ముక్కలు వంటి



వ్యవసాయ వ్యర్థాలను శుద్ధ ఇంధనంగా మార్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇదే సందర్భంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో వ్యర్థాల నిర్వహణకు ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది.

**పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు అందుబాటులోకి:**

ఈ ప్రణాళికను రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) జూలై 17న సమావేశమై పరిశీలించి ఆమోదించింది. పాలసీ ప్రకారం సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించనుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మద్దతు నిధులు కూడా ఈ ప్రణాళికకు వర్తిస్తాయని జీవోలో పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక భారం తీసుకోదని స్పష్టం చేశారు.

**రెండు సంవత్సరాల్లో కేంద్రాల నిర్మాణం పూర్తవ్వాలి**

ఈ రెండు జీవ వాయు కేంద్రాలను ఇరవై నాలుగు నెలల లోపు పూర్తి చేయాలి. ఈ మేరకు సంబంధిత శాఖలైన రెవెన్యూ, పరిశ్రమలు, విద్యుత్ పంపిణీ సంస్థలు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. పునరుత్పాదక విద్యుత్ సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ) అధికారుల ద్వారా మిగిలిన ప్రక్రియలు అమలులోకి తీసుకురావాలని జీవోలో పేర్కొన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటుతో శ్రీకాకుళం జిల్లా పరిశుభ్రమైన శక్తి రంగంలో కీలక ఘట్టంగా మారనుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణాభివృద్ధికి ఇదొక మంచి ప్రారంభంగా అధికారులు భావిస్తున్నారు.

# ఎయిర్‌పోర్టుపై ఆందోళన వద్దు

*** త్వరలో మీ అనుమానాలు తీరుస్తాం * అమరావతి ల్యాండ్ పోలింగ్ విధానం ఇక్కడ పాటిస్తాం * వచ్చే ఏడాది మార్చిలోగా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తిచేస్తాం * ఏపీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**



**పలాస, జూలై 29 (వార్త):** శ్రీకాకుళం, కుప్పం జిల్లాలో ఎయిర్పోర్టు నిర్మాణాలకు ప్రభుత్వం ప్రతిపాదించిందని, ఇందుకోసం టిడ్కో నుండి నిధులు మంజూరు చేసి సర్వే నిర్వహించి భూసేకరణ చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేద న్నారు. రైల్వే ఫ్లైఓవర్ వంతెన పునః పనులకు శాసన సభ్యులు గౌతు శిరీష, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన కర్ పుండ్కర్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరావతి ల్యాండ్ పోలింగ్ విధా నం పాటించి ఇక్కడ రైతులకు న్యాయం జరిగే టట్లు చేస్తామన్నారు. త్వరలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్ , రెవెన్యూ యంత్రాంగంతో ఎయిర్పోర్టు నిర్మాణం వలన భూములు కోల్పోయే రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అనుమానాలను నివృత్తి చేయనున్నట్లు తెలిపారు. ఎయిర్ పోర్టు నిర్మించనున్న ప్రాంత రైతులకు ప్రభుత్వం నుంచి మెరుగైన ప్యాకేజీ అందేలా కృషి చేస్తామన్నారు. పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిని వచ్చే ఏడాది మార్చి నెలలోగా పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రిని జిల్లాకు తీసుకువచ్చి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ను ప్రారంభించేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, శాసనసభ్యులు గౌతు శిరీష, ఆర్డిఓ జి. వెంకటేష్, తాసిల్దార్ టీ. కళ్యాణ చక్రవర్తి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## విద్యార్థులకు కంటి పరీక్షలు

**సరుబుజ్జిలి, జులై 29(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 6 నుంచి 18 సంవత్సరాల బాల, బాలికలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎం. మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన సరుబుజ్జిలి హైస్కూల్‌లో కంటి పరీక్షలను ప్రారంభించారు. హైస్కూల్ 108 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు పూర్తి చేశారు. ఈ పరీక్షల్లో దృష్టి లోపాలున్న 21 వారికి చికిత్సలు చేసి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలోలో సీహెచ్‌వో మోహనరావు, హెచ్‌ఎం ఎన్.కృష్ణారావు ఏఎన్‌ఎం శైలజ, హెల్త్ అసిస్టెంట్ ఎ.సింహాచలం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమం

**-5న విద్యుత్ కార్యాలయాల ఎదుట ధర్నా**

**-విజయవంతం చేయండి**

**-ప్రజలకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం**

**జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ పిలుపు**



**కొత్తూరు, జులై 29(వార్త):** విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయా లని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు, సంస్థల ఇచ్చిన పిలుపు మేరకు ఆగస్టు 5న విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాల వద్ద భారీ ధర్నా నిర్వహించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తూరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో "మాకొద్దు -స్మార్ట్ మీటర్" అనే నినా దంతో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో 'స్మార్ట్ మీటర్లు బద్దలుకొట్టండి' అని పిలుపునిచ్చిన లోకేష్, అధికా రంలోకి వచ్చాక అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడమంటే ప్రజల్ని మోసం చేయడమే అన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపే కుట్ర జరుగు తోందన్నారు. కేరళ, తమిళనాడు, బెంగాల్, కర్ణాటక రాష్ట్రాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నాయని, కానీ ఆంధ్రప్రదేశ్‌లో దశలవారీగా ప్రతి ఇంటికి ఈ మీటర్లు అమర్చేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. ఇది కేవలం మీటర్ మార్పు కాదు, విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు ముందడుగు అని చెప్పారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ వ్యవస్థలో ముందుగా డబ్బు చెల్లించి చార్జింగ్ చేసుకోవాలని, లేనిపక్షంలో కరెంటు నిలిచిపోతుందని స్పష్టం చేశారు. 93 నెలల వాయిదాల్లో చార్జీలు వసూలు చేయనున్న ఈ విధానాన్ని ప్రజలంతా ఎదుర్కొని, ధర్నా విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, సీఐటీయూ నాయకులు పల్ల కృష్ణ,పనస రమేష్, ఐలు నాయకులు ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## బంగారు కుటుంబాల డేటా వేగవంతం చేయాలి

**మందస, జులై 29(వార్త):** బంగారు కుటుంబాలకు సంబంధించిన ప్రక్రియను మార్గదర్శకులు వేగవంతం చేయాలని మందస ప్రత్యేకాధికారి డాక్టర్ సీహెచ్ నర్సింహులు అన్నారు. మందస మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాల డేటా ఎంట్రీను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఎస్‌ఎస్లు సమన్వయంతో పని చేయాల న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ కింతలి రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ తిరుమలకుమార్, మందస పశు వైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, పరిపాలనాధికారి బూరగాన ఋషేశ్వరరావు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల పంపిణీ




**మందస, జులై 29(వార్త):** పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా మందస మండలంలోని బంజిరియువరాజపురంలో రైతులకు మంగళవారం ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు. వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామన్నారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టి, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తూరు, ఇచ్ఛాపురం కళాశాలల్లో పెరిగిన అడ్మిషన్లు




**కొత్తూరు, జులై 29(వార్త):** కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది అని కళాశాల ప్రిన్సిపాల్ గణపతి ధనుంజయరావు మంగళవారం తెలిపారు. గత ఏడాది ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో 151 మంది విద్యార్థులు చేరగా, ఈ ఏడాది ఆ సంఖ్య 200 దాటినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించడం, పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణత శాతానికి వచ్చిన మెరుగుదల, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్య పుస్తకాలు మరియు నోట్ పుస్తకాలు వంటి కార్యక్రమాలు అడ్మిషన్ల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎఫ్‌ఏసీ విధానాలకు స్వస్తి పలికి రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ నియామకం, సైన్స్ విద్యార్థులకు నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల మెటీరియల్ పంపిణీ, ఖాళీగా ఉన్న పోస్టుల్లో అతిథి అధ్యాపకులను నియమించడం వంటి చర్యలతో కళాశాల నాణ్యతను మెరుగుపరచడం విద్యార్థులను ఆకర్షించాయన్నారు. అడ్మిషన్ల పెరుగుదలపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్, ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 31వరకు పదో తరగతి ఉత్తీర్ణులెవరికైనా కళాశాలలో చేరేందుకు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

**గర్ల్స్ కాలేజీలో..**



**ఇచ్ఛాపురం, జులై 29(వార్త):** స్థానిక గర్ల్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రవేశాలు పెరిగినట్లు ప్రిన్సిపాల్ వరదా శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో గత ఏడాది అన్ని గ్రూప్ లు కలిపి 217 మంది చేరగా ఈ ఏడాది 4 శాతం పెరిగి 229కి చేరుకుందని చెప్పారు. ఈ నెల 31 లోగా చేరేందుకు అవకాశం ఉందని, పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉన్నారని తెలిపారు.

## నిందితుడికి జైలు

**సంతబొమ్మాళి, జులై 29 (వార్త):** కొట్లాట కేసులో నేరం ఋజువు కావడంతో ముద్దాయి నౌపడ గ్రామానికి చెందిన రోకళ్ల ఎర్రన్నకు కోటబొమ్మాళి ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఎం. రోషిని రెండు నెలలు జైలు శిక్ష విధించినట్లు నౌపడ ఎస్సై నారాయణస్వామి తెలిపారు. నౌపడ గ్రామానికి చెందిన ఫిర్యాది చెన్నూరి వెంకట్ రాజు పై నిందితుడు రోకళ్ల ఎర్రన్న దాడి చేయగా నౌపడ పోలీసులు కేసు నమోదు చేయగా నేరం రుజువైంది. దీంతో కోర్టు రెండు నెలలు కారాగార శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజా ప్రయోజనాలే పరమావధి

**-సీపీఐ యంయల్ లిబరేషన్ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు**

**పలాస, జులై(వార్త):** ప్రజా ప్రయోజనాలే తమ పార్టీ పరమావధి అని సీపీఐ యంయల్ లిబరేషన్ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం కామ్రేడ్ చారు మజుందార్ 53వ వర్ధంతిని పురస్కరించుకుని బొడ్డపాడులో పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మత ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించి, ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై పోరాడితేనే కామ్రేడ్లుకు నిజమైన నివాళులు అర్పించే వాళ్లమవుతామన్నారు. ఆ దిశలో ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. రోజు రోజుకి ప్రజల మీద భారాలు వేసి కార్పొరేట్లను బలోపేతం చేసే పాలక పక్షాలకు వ్యతిరేకంగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, కె.దుష్యంత్, ఎం.రామారావు, పి.కామేశ్వరరావు, కైలాస్, జగదీష్ అప్పారావు, రాజారావు, రామారావు, రామకృష్ణ యుగంధర్, సుందరమ్మ వరహా లమ్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# గిరిజనాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

**-ఎమ్మెల్యే శిరీష**

**-రూ.2.3కోట్లతో గిరిజన**

**ఆశ్రమ పాఠశాలకు శంకుస్థాపన**

**మందస, జులై 29(వార్త):** గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, దీనిలో భాగంగానే ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని డబారిసింగి సమీపంలో రూ. 2. 3కోట్ల వ్యయంతో నిర్మించనున్న గిరిజన ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోంద న్నారు. మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చే స్తోందన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఈ ఆశ్రమ పాఠశాల నిర్మించడం ఎంతో గొప్ప విషయమన్నారు. పీఎం జన్ మన్ నిధు లతో నిర్మిస్తున్నామన్నారు. ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నా మని, ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నామ న్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, గ్రంథాలయ జిల్లా మాజీ ఛైర్మన్ పీరికట్ల విఠల్రావు, మందస, బాలిగాం పీఏసీఎస్ ఛైర్మన్లు తమిరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, పార్టీ నాయకులు డుంకురు తిరుపతిరావు, రాజాన మహేశ్, రట్టి లింగరాజు, ముంజేటి చంద్రశేఖర్, తమ్మినాన ధనుంజరావు, సాలిన మాధవరావు, మంగళపాత్రో, ఎం.నవీన్‌కుమార్, సారి ఢిల్లేశ్వర రావు, సవర లఖియా, డుంకురు బాలకృష్ణ, చెల్లూరి మేఘనాథం, అధికారులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కురిగాం ఎస్సీ బాలుర వసతిగృహానికి నూతన శకం

**-శేపాన విక్రమ్ కృషితో స్పందించిన ఎమ్మెల్యే...**



**కొత్తూరు, జులై 29(వార్త):** కొత్తూరు మండలం కురిగాంలోని ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థలో ఉండటాన్ని గమనించిన టీడీపీ యువ నాయకుడు శేపాన విక్రమ్.. ఈ దుస్థితిని పరిష్కరించేందుక అధికారులకు నిరంతరం విజ్ఞప్తులు చేస్తూ పోరాడుతున్నారు. ఈ కృషికి ఫలితంగా మంగళవారం శాసనసభ్యులు మామిడి గోవిందరావు రంగంలోకి దిగి, ఆ వసతిగృహాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వెంటనే స్పందన చూపించని వార్డెన్‌ను బదిలీ చేయించి, ప్రస్తుతం ఉండే విద్యార్థులకు తాత్కాలిక భద్రత కల్పించారు. త్వరలో కొత్త వసతి గృహ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు విక్రమ్ పట్టుదలపై ప్రశంసలు కురిపిస్తున్నారు.



## సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

**పలాస, జులై 29 (వార్త):** జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబర్ 13న నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షురాలు, జూనియర్ సివిల్ జడ్జి మాధురి తెలిపారు. మంగళవారం పలాస జూనియర్స్ కోర్టులో న్యాయవాదులు కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది, చిట్‌ఫండ్ కంపెనీలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. కక్షిదారులందరికీ ముందుగానే ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ పడ్డ సివిల్, క్రిమినల్ కేసులను ముందుగానే తెలియజేస్తే, ప్రీ లోక్ అదాలత్ ద్వారా ముందుగానే కేసులు రెడీ చేస్తామని, రాజీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బీకేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ, ఏజీపీ పిండి వెంకట్రావు, సీనియర్ న్యాయవాదులు ఎల్.చంద్రశేఖరరావు, కె.రజనీకుమార్, వి.రవికుమార్, జి.ప్రభాకర్‌రావు, కె.లోకేశ్వరరావు, శ్యామ్ సుందర్ రావు, ఎర్రన్న, చిట్టిబాబు, అంది రామకృష్ణ, ఏఎస్ఐ గణపతిరావు, కోర్ట్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, ధర్మారావు, సూపరింటెండెంట్ కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 34 కిలోల గంజాయితో ఒడిశా వ్యక్తి అరెస్టు



**ఇచ్ఛాపురం, జులై 29(వార్త):** ఒడిశా దిగిపొండినకు చెందిన బైద్య సాహు అలియాస్ సోనా సాహు అనే వ్యక్తిని 34 కిలోల గంజాయితో రైల్వే స్టేషన్ వద్ద టౌన్ ఎస్ఐ ఎం.ముకుంద రావు అరెస్ట్ చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు చెప్పారు. కరియా గూడ కి చెందిన సంతున్ దాస్ రైతుల వద్ద కొని ముంబై మలాద్ కి చెందిన లోబో కుండకి, తన అన్న కోయ దాసుతో కలిసి వెళ్లి అందిస్తే 10 వేల రూపాయల చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ద్విచక్ర వాహనంపై రెండు లగేజీ బ్యాగ్‌లలో 18 ప్యాకెట్ లను అందించేందుకు రెండో నెంబర్ ప్లాట్‌ఫాం పైకి వెళ్తుండగా బిద్యా సాహును అరెస్టు చేసి గంజాయి, ద్విచక్ర వాహనం సీజ్ చేసినట్లు చెప్పారు.

## ఉచిత నేత్ర చికిత్సాశిబిరం విజయవంతం

**కొత్తూరు, జులై 29(వార్త):** కొత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో జిల్లా అంధత్వ నివారణ సమితి సౌజన్యంతో, రాగోలు జెమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్రచికిత్సా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు యిప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు నిర్వహించగా, 12 మంది రోగులను కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరిని రాగోలు జెమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. కార్యక్రమంలో కొత్తూరు రెడ్‌క్రాస్ మండల కన్వీనర్ పొగిరి రవి పాల్గొన్నారు.



# పోస్టాఫీసు ఖాతాలకు మొబైల్ లింక్ చేసుకోండి

**-పోస్టల్ సూపరెండేంట్. హరిబాబు**



**ఇచ్ఛాపురం, జులై 29(వార్త):** పోస్టాఫీసు ఖాతాలకు మొబైల్ లింక్ చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు తెలిపారు. మంగళవారం ఆయన ఇచ్ఛాపురం సబ్ పోస్టాఫీస్‌లో ఖాతాదారులనుద్దేశించి మాట్లాడారు. కేవల 33 మందివి మాత్రమే ఆన్ లైన్ స్కాంకి గురయ్యాయన్నారు. మిగిలిన ఖాతాదారులు ఆందోళనకు గురి కావొద్దన్నారు. నగదు కోల్పోయిన వారి ఖాతాల్లో కొద్దిరోజులలోనే వడ్డీతో సహా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఖాతాదారులు వారి పాస్ పుస్తకాలు, బాండ్లను పోస్టల్ ప్రత్యేక శిబిరం వద్ద తనిఖీ చేయించుకొని, వెరిఫై స్టాంప్ వేసుకోవాలన్నారు. ఖాతాదారులు మొబైల్ నెంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలన్నారు. మొబైల్‌కు ప్రతి ట్రాన్సక్షన్ సమాచారం మెసేజ్ రూపంలో వస్తుందన్నారు. తనిఖీలో బయట పడ్డ ఇతర ఖాతాలకు కూడా న్యాయం చేస్తామన్నారు. వేరే ప్రాంతాల్లో ఉన్నవారు దేశంలో ఎక్కడి నుంచైనా సంబంధిత పోస్టాఫీసులో తనిఖీ చేయించుకోవచ్చన్నారు. కేసును సీబీఐకి అప్పగించామని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, జనసేన నాయకులు దాసరి రాజు, అంగన్‌వాడీ నాయకురాలు బర్ల హైమ, చాట్ల లోహిదాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన 'బుద్ధుడితో నా ప్రయాణం' నృత్య నాటక ప్రదర్శన



**శ్రీకాకుళం, జులై 29(వార్త):** శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో గల బృందావన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాత్రి జరిగిన 'బుద్ధుడితో నా ప్రయాణం' అనే నృత్య నాటక ప్రదర్శన అందరినీ అలరించింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన బుద్ధుడు ఆయన ధర్మం పుస్తకం ఆధారంగా రూపొందించిన నాటక ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. బుద్ధుని బోధనల సారాంశాన్ని.. డాక్టర్ అంబేద్కర్ జీవితంపై వాటి ప్రభావాన్ని ఈ నాటకంలో చక్కగా చూపించారు. ఈ నాటకం ఆహుతులను కట్టిపడేసింది. హైదరాబాద్‌కి చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సభ్యులు బుద్ధుడితో నా ప్రయాణం నృత్యనాటకాన్ని ప్రదర్శించగా బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, దళిత, ఆదివాసీ సంఘాల జేఏసీ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులతో పాటు దళితులు, ఆదివాసీలు,బహుజనులు ఇలా అన్ని వర్గాల వారు కూడా పాల్గొన్నారు. బుద్ధుడితో నా ప్రయాణం నృత్యనాటక ప్రదర్శన ప్రారంభానికి ముందు డా.బి.ఆర్.అంబేద్కర్, గౌతమ బుద్ధుడి చిత్రపటాలకి ప్రముఖ వైద్యులు, తల్లిపిల్లల ఆసుపత్రి అధినేత డాక్టర్ హర్షవల్లి, లలిత ఫౌండేషన్ చైర్మన్ కేకే రాజా, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకే రాజా నిర్వహణలో నాటకాన్ని ప్రదర్శించారు. బౌద్ధమతం వైపు అంబేద్కర్ నడవడానికి గల కారణాలను సవివరంగా నాటక రూపంలో కళాకారులు తెలియజేశారు. నృత్యనాటక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు వారివారి పాత్రలలో జీవించారు. కళాకారులపై ఆహుతులు అందరూ కూడా ప్రశంసల జల్లు కురిపించారు. బుద్ధుడితో నా ప్రయాణం నృత్య నాటక ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొ.కె.ఆర్. రజని, ప్రముఖ వైద్యులు, తల్లిపిల్లల ఆసుపత్రి అధినేత డాక్టర్ విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ శ్రీకాకుళం డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు, శ్రీకాకుళం తహసీల్దార్ గణపతి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మెట్ట రామారావులతో పాటు దళిత ఆదివాసీ బహుజన సంఘాల జేఏసీ నాయకులు, బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు, దుంగ కృష్ణమూర్తి, కల్లేపల్లి రాంగోపాల్, లింగాల గరికివాడు, బడియా కామరాజు, బొడ్డేపల్లి కృష్ణారావు, డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీను, రాయి వేణుగోపాల్, బోనెల రమేష్, హనుమంతు మన్మధరావు సాకేటి నాగరాజు, లింగాల అప్పన్న, బోయిడి మురళీకృష్ణ, లాస సోమేశ్వరరావు, సుధాకర్ మాస్టర్, అర్జీ ఈశ్వరరావు, రిటైర్డ్ తహాసిల్దార్ రామప్పుడు, బోకర నారాయణరావు, డా.రామారావు, డా.అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ నాటకాన్ని ప్రదర్శించేందుకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలను అందించి ప్రోత్సహించిన అతిథులను నిర్వాహకులు సత్కరించారు. తల్లిపిల్లల ఆసుపత్రి అధినేతలు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ హర్షవల్లిలకు దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేసారు. నృత్యనాటకాన్ని ప్రదర్శించిన కళాకారులకు ఇతర ప్రోత్సాహకులను కూడా ఈ సందర్భంగా నిర్వాహకులు సన్మానించారు.



## ఫార్మా, హెల్త్ కేర్ రంగాల్లో ఒడిశా విద్యార్థులకు..

# ఉచిత శిక్షణ, ఉద్యోగాల కల్పన



**పర్లాకిమిడి, జులై 29(వార్త):** ఒడిశాకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు ఫార్మా, హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించేందుకు శ్రీకాకుళంలోని బొల్లినేని మెడ్‌స్కిల్స్‌తో మంగళవారం ఎంవోయూ కుదుర్చుకున్నట్టు గజపతి జిల్లా డీఎస్‌డీఈవో సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠి తెలిపారు. ఎన్‌యూఏ ఒడిస్సా ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఈ శిక్షణ 240 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వ సహకారంతో అందించనున్నామన్నారు. ప్లస్ త్రీ పాసైన విద్యార్థులకు పేషంట్ రిలేషన్ అసోసియేట్, ఎస్ఎస్‌సీ, ప్లస్ టు, ప్లస్ త్రీ పాసైన లేదా ఫెయిలైన విద్యార్థులకు అసోసియేట్ స్టోర్ ఫార్మా కోర్సు నందు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ కోర్సులకు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణతో పాటు ఉచితంగా భోజన వసతి సదుపాయాలు, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 7331118019 లేదా శ్రీకాకుళం సమీపాన గల రాగోలు జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని ఆ సంస్థను సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, గజపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మందస పశు వైద్యశాలను తనిఖీ చేసిన డీడీ

**మందస, జులై 29(వార్త):** మందస పశు వైద్యశాలను టెక్కలి డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చందక నరసింహులు తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న లంపీస్కిన్, థెయలేరియా వ్యాక్సినేషన్ పురోగతిపై మందస పశువైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్‌ను అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.




# డబ్బులిచ్చుకో.. సీల్ పుచ్చుకో..!

**(సరుబుజ్జిలి)**

సరుబుజ్జిలిలో తూనికలు, కొలతల అధికారుల సమక్షంలో ముందస్తు రిపేరింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారు. సీల్‌కి రూ.300కాగా, రిపేరింగ్ చార్జి రూ.600, బిల్ రాసినందుకు రూ.100 అదనంగా కట్టించుకుంటున్నారు. తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ బలరామకృష్ణ ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్ భార్గవి లైసెన్స్ డీలర్లను నిలువ దోపిడీ చేస్తున్నారు. దీనిపై పలువురు డీలర్లు ప్రశ్నిస్తే జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 51 చూపిస్తూ పి.ఆర్.ఓ.సి.ఎస్.నెం. 7700/ఎల్ 1/99.తేదీ. 21-06-1999. చూపిస్తూ కలెక్షన్ చేస్తున్నారు. అయితే




Schedule - VIII
Government of Andhra Pradesh
Office of the Controller, Legal Metrology, Vijayawada
Certificate of Verification
Grand Total
Next verification due on

వాస్తవానికి తూకంలో తప్పులు ఉంటే సరిదిద్దేందుకు రూ. 600 కంటే ఎక్కువ తీసుకోరాదని జి. ఓ లో ఉండగా... తప్పుడు అర్థాలు చెప్తూ వసూళ్లు సాగిస్తున్నారు. ఈ విషయంపై భార్గవని ప్రశ్నించగా అంతా బాలరామకృష్ణ చెప్పినట్లు చేస్తున్నామని, మీరూ ఆయన దగ్గర వివరణ తీసు కోవాలని, జిల్లా మొత్తంగా ఇలానే నడుస్తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ స్పందించి ముందస్తు దోపిడీని నివారించాలని పలువురు డీలర్లు, వ్యాపారస్తులు కోరుతున్నారు.



## నారీశక్తిపై అవగాహన

**ఇచ్ఛాపురం, జులై 29(వార్త):** నారీశక్తిపై డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళా రక్షణ, బాల్య వివాహాలు, గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి వివరించారు. 112, 1098, 1930 టోల్ ఫ్రీ నెంబర్లపై రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.

## బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



**ఇచ్ఛాపురం, జులై 29(వార్త):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండపల్లి నుంచి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు జాడు ప్రకాష్, పద్మనాభం, సత్యమయ్య, రవికుమార్, నాగేశ్వరరావు, కమలకుమారి, రాణి గౌడో, కమలయ్య, సాజన్, బి.కే.బెహరా, మీనాక్షి, బృందబతిలను ప్రధానోపాధ్యాయులు టీవీ భార్గవి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శాలిహుండం వాసంతి, ఉపాధ్యాయులు గణపతి, ఉమా శంకర్, కవిరాజు, మురళీ, ఎస్.స్వాతి, అమూల్య, మహేశ్వరి, రమేష్, ఐ.లలిత, బి.స్వాతి, ఓ.లలిత, భీమరావు, సంజూ బెహరా, నీలవేణి, సబిత పాల్గొన్నారు.

## లొద్దపుట్టి, మండపల్లిల్లో పొలం పిలుస్తోంది



**ఇచ్ఛాపురం, జులై 29(వార్త):** లొద్దపుట్టి, మండపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అనేక అంశాలపై రైతులకు వ్యవసాయ అధికారి అజయ్‌కుమార్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఉడుపు వేసిన రైతులకు ఎరువుల కూపన్లు జారీ చేశారు. డ్రోన్ సాంకేతికత ద్వారా ఎరువుల ప్రయోజనాలు, మొక్కలకు నేరుగా ఎరువులు అందే విధానం, పంటల దిగుబడి పెరుగుదల, ఖర్చుల తగ్గుదల వంటి అంశాలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ సోనియా, సునీత పాల్గొని రైతులకు సూచనలు అందజేశారు.

## హామీలను ఎగ్గొట్టిన చంద్రబాబు

పలాస, **జులై 29(వార్త):** బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ, రీకాల్ చంద్ర బాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని బ్రాహ్మణతర్ల, బంటుకొత్తూరు పంచాయతీల్లో మంగళవారం వైసీపీ నేతలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారం వచ్చాక ముఖం చాటేసిన చంద్రబాబు నాయుడు తీరుని ఎండగట్టారు. కార్యక్రమంలో జిల్లా వైయస్సార్సీపి పార్టీ ఉపాధ్యక్షులు పైల చిట్టిబాబు, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, జడ్పీటీసీ ప్రతినిధి మచ్చ ధనరాజ , పలాస మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు దువ్వాడ రవి, జిల్లా కార్యదర్శి బత్తిని హేమేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, సర్పంచ్ బాడన పుష్ప, ఎంపీటీసీ రవణమ్మ, కంటయ్య, పలాస మండల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కార్యదర్శులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్ అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెలుగుదేశంలో ఎమ్మెల్యే ఎంజీఆర్



**కొత్తూరు, జులై 29(వార్త):** "సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తూరు మండలంలోని కురిగాం గ్రామాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సందర్శించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో సాగుతోందని తెలిపారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా కృషి చేస్తున్నామని, సుపరిపాలన లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కొత్తూరు మండల తేదేపా అధ్యక్షుడు అగతముడి మాధవరావు, పిఎసియస్ అధ్యక్షుడు మాతల గాంధీ, పిఎసియస్ డైరెక్టర్ దశరథ, రాము, అగతముడి అరుణ్‌కుమార్, కార్లేమ్మ సర్పంచ్ లోతుగడ్డ భగవాన్ నాయుడు, ముగితి కృష్ణ, వెంకటరావు, ఎన్డీఏ కూటమి నాయకులు, మండల స్థాయి పార్టీ శ్రేణులు, బూత్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలు..మోసం.. చంద్రబాబు నైజం

**మందస, జులై 29(వార్త):** ష్యూరిటీ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసం మాత్రం గ్యారంటీగా చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. మందస మండలంలోని బుడారిసింగి, పిడిమందస, బెల్లుపటియా పంచాయతీల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబద్ధపు హామీలు, అమలు చేయలేని పథకాలు, తప్పుడు ప్రచారాలతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వ అసలు స్వరూపం బయటపడిందన్నారు. ప్రజలకు నిలువునా మోసం చేశారని, ఇప్పటి నుంచే ప్రజలు చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరావు, జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, సర్పంచులు సురేష్ కుమార్ పాణిగ్రహి, అగ్గున్న రమణమ్మ, గున్న రమణ, దుంపల వైకుంఠరావు, కర్రి గోపాలకృష్ణ, యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్‌కుమార్, ఎంపీటీసీ కంచి



బెహరా, చింతాడ గణపతి, సిందిరి జగన్, బాడ జగన్నాయకులు, అగ్గున్న దేవేంద్ర, దువ్వు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

**నవ్వులు పూయించిన నినాదాలు**

మనిషి అన్నాక పొరపాట్లు సహజం. అయితే ఇవి కొన్నిసార్లు వివాదాలు అవుతాయి.. మరికొన్ని సార్లు నవ్వులు పూయిస్తాయి. సరిగ్గా ఇదే సంఘటన మందసలో జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మందస లోని బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ర్యాలీ, బస్టాండ్లో లో సమావేశం నిర్వహించి, కూటమి ప్రభుత్వం మోసం చేసిందంటూ.. నాయకులు ఉపన్యాసాలిచ్చారు. నినాదాలు కూడా ఇచ్చారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ పేరుతో చేస్తున్న ఈ కార్యక్రమాల్లో ఇదే నినాదంగా చెప్పాల్సి ఉండగా, 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ' అంటూ కొందరు నినాదాలు ఇచ్చారు. గుంపులో దీన్ని ఎవరూ గుర్తించలేదు. కానీ, కార్యక్రమం వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేసేసరికి నిశితంగా పరిశీలించిన కొంతమంది ఈ పొరపాటును గుర్తించారు. తక్షణమే సోషల్ మీడియాలో చేసిన పోస్టులను తొలగించారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీలో నాయకులు ఇలా నినాదాలు చేయడంతో వైకాపా కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో చైతన్యం చేయించాల్సి ఉందని చెప్పుకుంటున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546